క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



బండి ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలతో పాటు సరిహద్దు జిల్లా అయిన కృష్ణా జిల్లా నుంచి తరలివచ్చిన భక్తులతో అమ్మవారి ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ ఎం.అరుణ్ కుమార్, ఆలయ, చైర్మన్ కడలి మాణిక్యాలరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హైందవ శంఖారావ సభను విజయవంతం చేయాలి



ఏనుగువానిలంకలో సమావేశమైన హిందువులు

యలమంచిలి: హిందూ దేవాలయాలకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించడమే ధ్యేయంగా జనవరి 5న విజయవాడ దగ్గరలోని కేసరపల్లిలో జరుగుతున్న హైందవ శంఖారావ సభను విజయవంతం చేయాలని భజరంగ్‌దళ్ జిల్లా ఇన్‌చార్జి ముత్యాల సత్యనారాయణ (చంటి) కోరారు. ఏనుగువానిలంక గ్రామంలోని పుంతల ముసలమ్మ గుడి వద్ద ఉన్న రామాలయం వద్ద ఆదివారం నిర్వహించిన భజరంగ్‌దళ్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభకు ప్రతి గ్రామం నుంచి హిందువలంతా తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ సభ్యులు సురేంద్ర, పుణీంద్ర, కొండ, శ్రీను, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

నేవీ మారథాన్ పోటీలో ప్రతిభ



దేవ నిరంజన్

పాలకొల్లు సెంట్రల్: వైజాగ్ ఆర్‌కే బీచ్‌లో ఆదివారం నేవీ ఆధ్వర్యంలో నిర్వహించిన 42.195 కిలోమీటర్ల ఫుల్ మారథాన్ పోటీలో పాలకొల్లు పట్టణానికి చెందిన దేవ నిరంజన్ సత్తా చాటాడు. 42.195 కిలోమీటర్లు మారథాన్‌ను నిరంజన్ 5గంటల 15 నిమిషాల్లో పూర్తి చేశాడు. నిరంజన్ కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ కళాశాలలో బీఎస్సీ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. వైజాగ్‌లో 42.195 ఫుల్ మారథాన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం నిరంజన్ మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తాను ఫుల్ మారథాన్‌ను విజయవంతంగా పూర్తి చేయగలిగానని ఆనందాన్ని పంచుకున్నాడు. నిరంజన్ తండ్రి రాజేష్ కెమెరామెన్ కాగా, తల్లి కళ్యాణి ప్రభుత్వ హైస్కూలు ఫిజికల్ డైరెక్టర్‌గా సేవలను అందిస్తున్నారు.

బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

భీమవరం అర్బన్: భీమవరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సీఐ కె. బలరామరాజు తన సిబ్బందితో ఆదివారం దిరుసుమర్రులో దాడులు చేశారు. ఈ దాడుల్లో బెల్టు షాపు నిర్వహిస్తున్న వీరమల్లు సత్యనారాయణను అదుపులోకి తీసుకుని ఆయన వద్ద నుంచి 9 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఆయనపై కేసు నమోదు చేశారు. మండలంలో ఎవరైనా బెల్టు షాపు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెల్టు షాపు నిర్వహిస్తే 94409 02439కు సమాచారం ఇవ్వాలని కోరారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు పీవీవీఎస్ ఉమా మహేశ్వరరావు, పి.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్నేషనల్ మాస్టర్ చెస్ కోచింగ్ క్యాంప్

భీమవరం: భీమవరం అనసూయ చెస్ అకాడమీలో గత రెండు రోజులుగా నిర్వహించిన ఇంటర్నేషనల్ మాస్టర్ చెస్ కోచింగ్ క్యాంప్ ఆదివారంతో విజయవంతంగా ముగిసింది. అనసూయ చెస్ అకాడమీ సెంటర్ నిర్వాహకుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ ఈ కోచింగ్ క్యాంపులో ఇంటర్నేషనల్ మాస్టర్ పీడీఎస్ గిరినాథ్ చే క్రీడాకారులకు చదరంగంలో అత్యున్నత స్థాయిలో శిక్షణ ఇచ్చామన్నారు. మన ప్రాంతం నుంచి కూడా క్రీడాకారులను ఇంటర్నేషనల్ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని ఉద్దేశంతో ఇంటర్నేషనల్ మాస్టర్‌తో శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రుల ప్రోత్సాహం మరింత అవసరమని, భవిష్యత్తులో భీమవరం నుండి ఇంటర్నేషనల్ చెస్ మాస్టర్ స్థాయికి తీర్చిదిద్దుతామన్నారు. ఇంటర్నేషనల్ మాస్టర్ గిరినాథ్ మాట్లాడుతూ ఈ కోచింగ్ క్యాంపులో ఎంతో టాలెంట్ ఉన్న క్రీడాకారులు ఉన్నారని, వారి తల్లిదండ్రులు కూడా ఎంతో పట్టుదలతో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని అన్నారు. సంఘ సేవకులు అల్లు శ్రీనివాస్, జిల్లా చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి మైలాపురి మురళి, సురేష్ జైన్ పాల్గొన్నారు.

అతివేగం.. మృత్యుపాశం

- రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న యువత
- అతి వేగమే ప్రధాన కారణమంటున్న పోలీసులు



పెనుగొండ-మార్టేరు రహదారిలో మృతి చెందిన దొడ్డి నాగరాజు (ఫైల్)



పెనుగొండ-మార్టేరు రహదారిలో ప్రమాదంలో గాయపడిన యువకుడు



భట్లమగుటూరు వద్ద జరిగిన ప్రమాదంలో రెండుగా విడిపోయిన మోటార్ సైకిల్ (ఫైల్)

పెనుగొండ: యువత రయ్‌రయ్ మంటూ మితిమీరిన వేగంతో వెళ్తూ మోటార్ సైకిల్ ప్రమాదాలకు గురవుతూ ప్రాణాలు గాలిలో కలిపేసుకొంటున్నారు. ఇటీవల కాలంలో ప్రమాదాల సంఖ్య మరీ పెరిగిపోతుండడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకులు జాగ్రత్త తిరిగి వస్తారో లేదో నంటూ కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. పెనుగొండ మార్టేరు రహదారిలోనూ, మార్టేరు పెనుమంట్ర రోడ్డులోనూ, మార్టేరు ఆచంట రోడ్డులోనూ నిత్యం ప్రమాదాలకు గురవుతూ తీవ్ర గాయాల పాలవుతూ, లేదా ప్రాణాలు విడుస్తుండడంతో వేగంగా వస్తున్న మోటార్‌సైకిల్ చూస్తూ హడలిపోయి ఇతరులు దారి ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల దొంగరావిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రదీప్ గోతులోపడి ప్రమాదానికి గురై ప్రాణాలు విడిచారు. అదేవిధంగా పెనుగొండ మార్టేరు రహదారిలో దొడ్డి నాగరాజు ప్రాణాలు సంఘటన స్థలంలోనే విడిచాడు. పెనుమంట్ర మండలం భట్లమగుటూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిల్ రెండు భాగాలుగా విడిపోవడమే కాకుండా, చిర్రా అకిల్ తీవ్ర గాయాలుకు గురై ఆసుపత్రి పాలయ్యారు. ఇదేవిధంగా మార్టేరులోనూ, ఆచంట రహదారిలోనూ, పెనుగొండ సిద్ధాంతం రహదారిలోనూ నిత్యం ప్రమాదాలుకు గురవుతున్నారు.

హెల్మెట్‌లు ధరించకపోవడంతో..

మితీమీరిన వేగంతో వెళ్తూ హెల్మెట్ ధరించకపోవడం సైతం మరణాలకు కారణమవుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. కొందరు మద్యం సేవించిన మత్తులో సైతం వేగంగా బైక్ డ్రైవ్ ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం వేగనియంత్రణకు తనిఖీలు నిర్వహిస్తున్నా ఎలాంటి ఫలితాలు ఇవ్వడం లేదని ప్రజలు చెబుతున్నారు. లైసెన్స్ లేని మైనార్టీలకు మోటార్ సైకిళ్ల ఇవ్వడం సైతం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు మోటార్ సైకిళ్ల ఇవ్వకుండా స్వీయ నియంత్రణ చేయాల్సిన ఆవసరం ఉందన్నారు. తనిఖీల్లో పట్టుబడితే కేసులు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్డీవో దాసి రాజు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటలు నుంచి అందించాలని కోరారు.

ముగిసిన షష్ఠి వేడుకలు

నరసాపురం: పట్టణంలోని చినమామిడిపల్లిలో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద షష్ఠి వేడుకలు ముగిశాయి. ఆదివారం ఆలయ వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. అన్నసమారాధన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో ట్రైనీ ఐఏఎస్

యలమంచిలి: గుంపర్రు గ్రామంలోని శ్రీవల్లీ దేవసేనా సహిత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఆదివారం ట్రైనీ ఐఏఎస్ పవన్ దత్తా దర్శించుకున్నారు. మహారాష్ట్రకు చెందిన పవన్ దత్తా ప్రస్తుతం తిరుపతిలో ట్రైనీ ఐఏఎస్‌గా శిక్షణ పొందుతున్నారు. ఆలయానికి వచ్చిన పవన్ దత్తాకు గ్రామస్తులు స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు ఖండవల్లి సూర్యనారాయణశర్మ ఆయనకు దేవేరుల దర్శనం చేయించి ఆశీర్వచనం పలికి, శేషవస్త్రం అందించారు.

ఘనంగా పిరమిడ్ ధ్యాన కేంద్ర వార్షికోత్సవం



సంగీత నాద ధ్యానం చేస్తున్న గ్రామస్తులు

పెనుమంట్ర: గ్రామంలో భూపతిరాజు శ్రీనివాసరాజు సాయిగీత దంపతులు నిర్మించిన జగద్గురు పత్రీజీ ధాన్య మందిరంలో ద్వితీయ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పిరమిడ్ మాస్టర్ వేణు విద్వాన్, నాదయోగి టి.గణేష్ వాయిద్య బృందం పాల్గొని జ్ఞాన బోధన చేసి అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్, పీఎస్ఎస్ఎం అధ్యక్షుడు రుద్రరాజు పెద్దివర్మ, సత్యసాయి సేవాదళ్ సభ్యులు డి.రాధాకృష్ణ, దాసం ప్రసాద్, కె మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత యూత్ హాస్టల్స్ లక్ష్యం



యూత్ హాస్టల్స్ ప్రముఖులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: పర్యాటకం, అడ్వెంచర్ స్పిరిట్, జాతీయ సమైక్యత, విద్య ఆరోగ్యం ప్రోత్సహించడం, పరిమిత మార్గాల్లో మిలియన్ల మంది యువతకు వారి ప్రయాణ సమయంలో సరసమైన ధరలకు స్థిరమైన ప్రాతిపదికతో సాహసాలు చేయించడం యూత్ హాస్టల్స్ లక్ష్యమని యూత్ హాస్టల్స్ జాతీయ చైర్మన్ మనోజ్ జోషిరి, నేషనల్ వైస్ చైర్మన్ రవీ శంకర్ పాల్ అన్నారు. భీమవరం త్యాగరాజ భవనంలో యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా భీమవరం యూనిట్ 35వ వార్షికోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. అనంతరం 10 రాష్ట్రాలు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి విచ్చేసిన 100 మంది యూత్ హాస్టల్స్ ప్రముఖులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, యూత్ హాస్టల్స్ చైర్మన్ డా. వీవీ సోమరాజు, మాట్లపూడి సత్యనారాయణ, చిలుకూరి నరసింహరాజు పాల్గొన్నారు.

చలో గుంటూరుకు తరలిన మాల మహానాడు నేతలు



పెనుగొండ: మాల మహాగర్జన సభ వద్ద ఆచంట నియోజకవర్గ నాయకులు



పాలకొల్లు సెంట్రల్: గుంటూరు మాలల మహాగర్జనకు వెళ్తున్న నాయకులు

పెనుగొండ: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ గుంటూరులో రిటైర్డ్ ఐఆర్ఎస్ ఉప్పులేటి దేవి వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మాలల మహాగర్జనకు ఆచంట నియోజకవర్గం నుంచి మాలమహానాడు నేతలు తరలివెళ్లారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటమిల్లి మంగరాజు, అఖిల భారత మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ గుమ్మాపు సూర్యవరప్రసాద్ ఆధ్వర్యంలో సుంకర సీతారాం, కోట వెంకటేశ్వరరావు, మట్టా చంటి, నాగిపల్లి శ్రీనివాస్, సబ్బితి మధుతోపాటు అనేకమంది నాయకులు మహాగర్జనకు తరలివెళ్లారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: కేంద్ర, ఉభయ తెలుగురాష్ట్రాల నాయకులు తమ రాజకీయ లబ్ధి కోసం అన్నదమ్ముల్లా కలిసి ఉన్న మాలమాదిగలను ఎస్సీ వర్గీకరణ పేరుతో చిచ్చు రగల్చి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని పీవీ రావు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గుమ్మాపు సూర్యవరప్రసాద్ అన్నారు. ఆదివారం గుంటూరులో జరగనున్న మాలల మహాగర్జన కార్యక్రమానికి పాలకొల్లు నుంచి పెద్ద ఎత్తున మాలలు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా గుమ్మాపు మాట్లాడుతూ 341,345 ఆర్టికల్ ప్రకారం ఎస్సీ వర్గీకరణ చెల్లదని తెలిసి రాజ్యాంగానికి తూట్లు పొడిచారన్నారు. మతతత్వ పార్టీల అడుగుజాడల్లో నడుస్తున్న మందకృష్ణకు మాలల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. 2001 జనాభా ప్రాతిపదికన 18 శాతం ఉన్న రిజర్వేషన్ శాతాన్ని 21 శాతానికి పెంచే విదంగా మందకృష్ణ ఉమ్మడి పోరాటానికి సిద్ధం కావాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మానుకొండ శ్రీనుబాబు, మీసాల జయరాజు, సుంకర సీతారామ్, బండ శ్యామ్‌బాబు, ముప్పిరి సత్యనారాయణ, పితాని పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోడూరులో..

పాలకొల్లు అర్బన్: ఎస్సీ వర్గీకరణ, క్రీమిలేయర్‌కి వ్యతిరేకంగా అఖిల భారత మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గుంటూరులో తలపెట్టిన మాలల సింహగర్జన బహిరంగ సభకు పోడూరు మండలం నుంచి మాల సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పెద్ద సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. పోడూరు మండల మాలమహనాడు నాయకుడు భీమారావు మాట్లాడుతూ మాలల భవిష్యత్తు తరాలకు అంబేడ్కర్ ఫలాలు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం తలపెట్టినట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ చేయడం ద్వారా మాలలకు అన్యాయం చేయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. తక్షణం ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యుత్ కాంతులతో చర్చిలు కళకళ



సెవెంత్ డే ఎడ్వంటిస్టు చర్చి వద్ద విద్యుత్ అలంకరణ



విద్యుత్ దగదగలతో శంభునిపేట లూథరన్ చర్చి



ఆర్‌సీఎం చర్చి వద్ద ఆకట్టుకుంటున్న అలంకరణ

క్రైస్తవులకు ముఖ్యమైన పండుగల్లో ఒకటైన క్రిస్మస్ సందర్భంగా మండలంలోని అన్ని చర్చిలను విద్యుత్ కాంతులతో ప్రత్యేకంగా అలకరించారు. చర్చిల ముందు క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ఏసుక్రీస్తు పుట్టిన పశువుల పాకలను చర్చిల ముందు ఏర్పాటు చేస్తున్నారు. చర్చిల ముందు ప్రత్యేకంగా పెద్ద స్టార్‌లను ఏర్పాటు చేయడంతో ప్రత్యేక ఆకర్షణగా చర్చిలు దర్శనమిస్తున్నాయి. – పాలకొల్లు అర్బన్

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



పెనుగొండ: అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ చేస్తున్న దృశ్యం

పెనుగొండ: అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ పెనుగొండ గాంధీ బొమ్మల సెంటర్‌లో ఆదివారం వైభవంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా మండల ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో గ్రంధి రాము సహకారంతో విగ్రహావిష్కరణ చేశారు. తెలుగు రాష్ట్ర ఏర్పాటుకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన కృషిని సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ నూలి ధీరజ్, ఉద్దగిరి శ్రీధర్(దత్తు), కానూరి అర్జునరావు, ఫణీంద్ర, చేవూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ పంచాయతీలో

పెనుగొండ గ్రామ పంచాయతీలో అమరజీవి పొట్టి శ్రీరాములు గ్రామ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి టి.రత్నాకరరావు పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం: తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం బలిదానం ఆత్మార్పణం చేసుకున్న పొట్టి శ్రీరాములు అమరజీవి అని నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య అన్నారు. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణదినం సందర్భంగా ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలులు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నాడు పొట్టి శ్రీరాములు అంతటి త్యాగం చేయకపోతే భాషా ప్రయుక్తరాష్ట్రలు ఏర్పడేవి కాదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు వైకేఎస్, మున్సిపల్ మేనేర్ నిర్మలకుమారి, ఆర్ఐ నానాజీ, డీఈ ప్రవీణ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: పెనుమంట్ర మండలశాఖ మానవతా సభ్యులు అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మార్టేరు సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటులో పునాది వేసింది అమరజీవి పొట్టి శ్రీరాములు అని జిల్లా సభ్యులు కొత్త సత్యనారాయణమూర్తి అన్నారు. కార్యక్రమంలో చైర్మన్ కడలి సుబ్రహ్మణ్యం, రీజనల్ చైర్మన్ బాణాల శ్రీనివాసరావు, చీర్ల శ్రీనివాసరెడ్డి, పడాల రామచంద్రా రెడ్డి, చదువుల నరేంద్ర పాల్గొన్నారు.

వ్యవసాయ పరిశోధనా స్థానంలో

మార్టేరు వ్యవసాయ పరిశోధనాస్థానంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ పరిశోధనా స్థానం ఇన్‌చార్జ్ ఏడీఆర్ డాక్టర్ బి.సహదేవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శ్రీనివాసరావు, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.రాధిక ముఖ్య అతిథులుగా హాజరై అమర జీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నరసాపురం: పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



పెనుమంట్ర: మార్టేరులో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

స్మార్ట్ మీటర్ల విధానాన్ని ఉపసంహరించుకోవాలి



సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

భీమవరం: కేంద్ర ప్రభుత్వం అదానీతో చేసుకున్న అన్ని రకాల ఒప్పందాలను వెంటనే రద్దు చేసి, స్మార్ట్ మీటర్లు పెట్టే విధానాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకుడు ఎం.వైకుంఠరావు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో 38వ వార్డు లంకపేటలో నిరసన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైకుంఠరావు మాట్లాడుతూ కూటమిప్రభుత్వం ప్రజలపై ట్రూ అప్ చార్జీలు పేరుతో ప్రజలపై భారాలు వేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చల్లబోయిన వెంకటేశ్వరరావు, కొమరగిరి సాయమ్మ, కుమారి, కొమరగిరి రమేష్, సామ్యూల్ రాజు పాల్గొన్నారు.

గోదావరి ఘాట్‌లు అధ్వానం

కోట్లాది రూపాయల ప్రజాధనం వ్యర్థం



మట్టి పేరుకుపోయిన కొండాలమ్మ ఘాట్



అధ్వానంగా ఉన్న వలందర్‌రేవు



నిరుపయోగంగా మారిన అమరేశ్వర ఘాట్



బుడ్డిగరేవు ఘాట్ దుస్థితి

నరసాపురం: నరసాపురం వశిష్ట గోదావరి బండ్ పొడవునా 2015 గోదావరి పుష్కరాల సమయంలో నిర్మించిన ఘాట్‌లు శిథిలావస్థకు చేరాయి. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో కోట్లాది రూపాయలు ప్రజాధనం వృథా అయ్యింది. పుష్కరాల సమయంలో లాకులు నుంచి కొండాలమ్మ గుడి వరకూ బుడ్డిగరేవు, అమరేశ్వర ఘాట్, లలితాంబ ఘాట్, వలందర్‌రేవు, కొండాలమ్మ ఘాట్‌లను అప్పటిలోనే రూ.10 కోట్లతో అభివృద్ధి చేశారు. అప్పటి టీడీపీ హయాంలో పనులు అవినీతితో సాగడంతో నాణ్యత కొరవడింది. దీంతో సాధారణంగానే రేవులన్నీ దారుణంగా శిథిలమ్మాయి. ఇక తరువాత రేవులను మరమ్మతులు చేయడం, పర్యవేక్షించడంలాంటి పనులు అధికారులు చేయకపోవడంతో ఇప్పుడు అవి ఉపయోగం లేకుండాపోయాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ఘాట్‌లను వినియోగంలోకి తీసుకునిరావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.